సాక్షి చిత్తూరు

మంగళవారం । 23 । మే । 2023



ఇంద్రవరదుని ధ్వజారోహణం

యాదమరిలో ఇంద్రవరదుని వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. దేవదేవేరులు చంద్రప్రభ వాహనంపై విహరించారు. - IIలో



పునీతం.. అగ్నిప్రవేశం

ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా సోమవారం ముత్తుమారెమ్మ తల్లి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	39	27
తిరుపతి	39	26
తిరుమల	36	23
గూడూరు	41	29
నగరి	41	27

న్యూస్‌రీల్

పంటలపై ఏనుగుల దాడి



రాలిపోయిన మామిడి కాయలు

రామకుప్పం: మండలంలోని ఎస్.గొల్లపల్లె సమీపంలో ఉన్న పంట పొలాలపై ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేసింది. స్థానిక రైతులు బాబు, మురుగేష్ గౌడ్‌కు చెందిన అరటి, రవికుమార్, గంట్లప్ప గౌడ్, సుకుమార్‌కు చెందిన మామిడితోటను నాశనం చేశాయి. ఏనుగుల సంచారం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు కోరారు.

శాప్ డైరెక్టర్‌గా యాదవేంద్రరెడ్డి



శాప్ ఎండీ నుంచి నియామకపత్రం అందుకుంటున్న యాదవేంద్రరెడ్డి

వడమాలపేట : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్‌గా యాదవేంద్రరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో శాప్ మేనేజింగ్ డైరెక్టర్ హర్షవర్ధన్ చేతులు మీదుగా నియామక పత్రం అందుకున్నారు.ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ఆర్‌కే రోజా ఆశయాలకు అనుగుణంగా క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, సోషయల్ మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

మరింత విస్తృతంగా పల్లె వైద్యం

చిత్తూరు రూరల్: పల్లె వైద్యసేవలను మరింత విస్తృతం చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో డీసీహెచ్‌ఎస్ బీఎస్‌కే నాయక్‌తో కలిసి ఎంఎల్‌హెచ్‌పీలకు (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు) బేసిక్ లైఫ్ సేవింగ్ పద్ధతులు, పాము, కుక్కకాటు చికిత్సపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆ మేరకు ఎంఎల్‌హెచ్‌పీలు పనిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ శ్రీనివాసరావ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.


సరెండర్ సెలవుల నగదు జమ



ఏన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన సరెండర్ సెలవుల నగదును ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవులు వెల్లడించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 19, 20 తేదీల్లో పోలీసులకు రూ.554 కోట్లు విడుదల చేసిందన్నారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఈ నెల 22వ తేదీ నుంచి సరెండర్ సెలవుల నగదును చెల్లిస్తున్నట్లు వివరించారు. ఎన్జీఓల తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జీఓ నంబర్ 117 రద్దుకు వినతి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

చౌడేపల్లె : పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల కుదింపునకు ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విన్నవించారురు. సోమవారం మండలంలోని పుదిపట్ల హైస్కూల్‌లో యూటీఎఫ్ సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 117 జీఓ కారణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వం భావిస్తోందన్నారు. కానీ, 3,4,5 తరగతులను విలీనం చేయడం వల్ల చాలా మంది విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోముశేఖర్‌నాయుడు, కార్యదర్శి జీవీ. రమణ, నేతలు పీఆర్ మునిరత్నం, రెహెనాబేగం, ప్రసన్నకుమార్, జగన్మోహన్‌రెడ్డి, రెడ్డెప్ప, నాయుడు, మునిగండన్, ఏకాంబరం, ఈశ్వర్, మహేంద్ర, సరిత, శశికుమార్,మోహన్, బాబూ రమేష్, వెంకటరమణ పాల్గొన్నారు.



రైతు పండించిన దేశవాళీ వరి (ఇన్‌సెట్) ఇల్లెంపు సాంబ (బ్లాక్ రైస్)

దేశవాళీ వంగడం.. దివ్య ఔషధం

పీజీ చదివి, అధ్యాపక వృత్తిలో స్థిరపడిన విద్యావేత్త సేద్యంలోకి దిగారు. దేశవాళీ వంగడాలపై అన్వేషించి, అత్యంత పురాతన రకాలను సేకరించారు. ఆ వరి వంగడాలను స్వయంగా తన పొలంలోనే సాగు చేశారు. వాటి వల్ల ప్రయోజనాలను రైతులకు తెలియజేశారు. రసాయన ఎరువులు, పురుగుమందులతో విషతుల్యమవుతున్న ఆహారాన్ని త్యజించాలని సంకల్పించారు. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను భవిష్యత్ తరాలకు అందించేందుకు కంకణం కట్టుకున్నారు. అంతరించిపోతున్న వరి వంగడాల్లో ఉన్న దివ్య ఔషధ గుణాలను వెలుగులోకి తీసుకొచ్చారు చందూల్ కుమార్ రెడ్డి. ఆయన చేస్తున్న ప్రకృతి సేద్యంపై ప్రత్యేక కథనం.

- కొలువును వదిలి మట్టితో స్నేహం
- ప్రకృతి సేద్యంలో ప్రయోగాలు
- ఆరోగ్య ఉత్పత్తులపై విద్యావేత్త పరిశోధన
- 15 రకాల ప్రాచీన వరి వంగడాల సాగు

పలమనేరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా అద్భుతాలను సృష్టిస్తున్న రైతు బంగారుపాళెం మండలం నల్లంగాడు గ్రామానికి చెందిన చందూల్ కుమార్ రెడ్డి. ఈయన ఎంఏ తెలుగు, తిరుపతి ప్రాచ్య కళాశాలలో ఎంఏ సంస్కృతం ఆపై బీఈడీ పూర్తి చేశారు. సంస్కృత అధ్యాపకులుగా రెండు దశాబ్దాల పాటు పనిచేశారు. సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తిని పెంచుకున్నారు. తల్లికి బీపీ, షుగర్ కారణంగా ఇబ్బంది పడుతుంటే దీనికి మూలాలను వెతికారు. ప్రస్తుత జీవన శైలితోపాటు ఆహార ఉత్పత్తులూ కారణమే అని తెలుసుకున్నారు. అంతే తన కొలువుకు స్వస్తి చెప్పి సేద్యంలోకి దిగారు. క్రిమిసంహారకమందులు లేకుండా పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లోనే అన్ని రకాల పంటలను సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం, దేశవాళీ విత్తనాలు, దేశవాళీ ఆవుల ద్వారా పంటల సాగుపై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తూ రైతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ సేవలను గుర్తించి పలు రాష్ట్రాల్లో ఆయనకు సన్మానాలు చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఆయన దేశవాళీ వరి వంగడాలపై ప్రచారం చేస్తున్నారు.

వరిలో సరికొత్త ప్రయోగాలు

సాధరణంగా వరికి 90శాతం నీటి అవసరం. కానీ ఈయన తన మెట్టపొలంలో ఆరుతడి పంటగా వరిని డ్రిప్ విధానం ద్వారా నీటినందిస్తూ సాగు చేస్తున్నారు. ఇప్పటికే కూజిపటాలియా, బహురూపి రకాలను సాగుచేశారు. అంతేకాదు మల్బరీలో అంతరపంటగా వరిని సాగుచేస్తున్నారు. తుఫాన్లు, వరదలొచ్చినప్పుడు వరిమడి నేలవాలిపోతున్న విషయం తెలిసిందే. అలాంటి సమస్య లేకుండా వెన్ను వాల్చని వరి వంగడమైన దేశవాళి రకం ఐదు అడుగులు పెరిగే బహురూపి ప్రస్తుతం ఆయన పొలంలో కోతకొచ్చింది.



ఘన జీవామృతాన్ని పొలంలో చల్లుతున్న చందూల్ కుమార్



నవార రకం బియ్యం

అంతరించిపోతున్న దేశవాళీ

మన దేశంలో హైబ్రిడ్ రకాల రాకతో అత్యంత ప్రాచీనమైన వరి వంగడాలు అంతరించిపోయాయి. అత్యంత విలువైన పోషకాలను కలిగి మనిషికి మంచి ఆరోగ్యాన్నిచ్చే దేశవాళీ వరి రకాల సాగుకు ఆయన కృషి చేస్తున్నారు. అందులో భాగంగా దేశవాళి రకాలైన నవారా, కుజీపటాలియం, బహురూపి, కాలాబాటి, అల్లుడు బియ్యం, చిట్టి ముత్యాలు, కోతాంబరి, రత్నచోడి, కకోడి, బైరొడ్లు, రక్తశాలి, పూంగార్, జీరగసాంభ, పోక్కూర్, ఇల్లెపు సాంభ రకాల వరిని తన పొలంలో సాగుచేశారు. వీటి విత్తనాలను ఆసక్తిగల రైతులకు అందుబాటులో ఉంచారు.

ఈ నవారా ఓ వయాగ్రా

దేశంలోని పురాతన వరి వంగడాలకు ఎన్నో రకాల వ్యాధులను నయం చేసే గుణం ఉంది. ఎరుపు రంగులో ఉండే నవారా బియ్యం కేరళలో ఎక్కువగా ఔషధంగా ఉపయోగిస్తున్నారు. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉండి గ్లైకోమిన్ ఇండెక్స్ తక్కువగా ఉండడంతో షుగర్ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుంది. పక్షవాతం బారిన పడిన వారికి కేరళలో భోజనం వండి పెట్టడంతోపాటు ఇదే అన్నాన్ని శరీరంపై మర్దన చేస్తారు. ఇండియన్ వయాగ్రాగా పిలిచే నవారాకు దేశవాళి రకాల్లో సంజీవనిగా పేరుంది. బియ్యం నుంచి మొలకలు రావడం దీని ప్రత్యేకత. ఇవికాకుండా ప్రతి దేశవాళీ రకానికి ఓ వ్యాధికి దివ్యమైన ఔషధంలా పనిచేసే గుణం ఉందని పరిశోధకులు చెబుతున్నారు.

దేశవాళీ కూరగాయలు

ప్రస్తుతం హైబ్రిడ్ రకాలతో కనిపించకుండా పోయిన దేశవాళీ కూరగాయల విత్తనాలను ఆయన సేకరించాడు. ఈ నెల 25న రోహిణి కార్తె ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆ రోజు వీటిని విత్తేందుకు ఇప్పటికే పొలాన్ని సిద్ధం చేసుకున్నారు. నాటు రకాలైన కూరగాయలు, ఆకుకూరలు, పప్పు ధాన్యాలను సైతం సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

జన్యు మార్పిడి విత్తనాలతోనే ముప్పు



ప్రస్తుతం అందుబాటులో ఉన్న విత్తనాలను జన్యు మార్పిడి(జెనిటికలీ మోడిఫైడ్ సీడ్స్) చేసి రూపొందించారు. దీంతో అధిక ఉత్పత్తి, తక్కువ వ్యవధిలో పంట వస్తుందని రైతులు హైబ్రిడ్ విత్తనాలను సాగుచేస్తున్నారు. అయితే పోషకాలు లేని వీటిని ఆహారంగా తీసుకోవడం వల్ల మనిషి శరీరంలో సమతుల్యత దెబ్బతిని రోగనిరోధకశక్తి తగ్గిపోతోంది. తద్వారా కొత్త రోగాలకు కారణమవుతోంది. అందుకే దేశవాళీ విత్తనాల ఉద్యమాన్ని చేపట్టాలన్న లక్ష్యంతో ప్రకృతి సేద్యానికి పూనుకున్నా. అన్ని రకాల దేశవాళీ వరి విత్తనాలు ఉన్నాయి. కావాల్సిన రైతులు తీసుకెళ్లి సాగుచేసుకోవచ్చు.

– చందూల్‌కుమార్ రెడ్డి, ప్రకృతి రైతు, కుర్మాయి గ్రామం

సేంద్రియంతోనే మనుగడ



మితిమీరిన రసాయనాల వాడకంతో పంటలను సాగుచేసి వాటిని తినడం ద్వారా మనిషికి వ్యాధులు తప్పడం లేదు. మన తాతల కాలంలో తిన్న ఆహారం శక్తివంతంగా ఉండబట్టే వాళ్ళు ఎలాంటి రోగాలు లేకుండా ఎక్కువకాలం బతికారు. కాని నేడు ఆ పరిస్థితి లేదు. రైతులు వ్యాపారకోణంలో ఆలోచిస్తూ అధిక దిగుబడి కోసం హైబ్రిడ్ వంగడాలను సాగుచేస్తున్నారు. తమశాఖ ద్వారా సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో ఇతర రైతులను మమేకం చేస్తున్నాం.

– సంధ్య, వ్యవసాయ అధికారి , పలమనేరు

పవిత్రం.. మహాసంప్రోక్షణం

మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ మహోత్సవం పరిపూర్ణమైంది.. ఆధ్యాత్మికతను ఇనుమడింపజేస్తూ విరాజిల్లుతోంది. ఆధునికీకరణ అనంతరం అద్భుత దివ్యతేజస్సును సంతరించుకుంది.. విమాన గోపుర కలశానికి మహాసంప్రోక్షణతో మరింత మహిమాన్వితంగా విలసిల్లుతోంది.. శిథిలావస్థకు చేరిన పురాతన క్షేత్రాన్ని అపురూపంగా తీర్చిదిద్దిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి భక్తజనం కృతజ్ఞతలు తెలియజేస్తోంది. ఆయన అపార భక్తివిశ్వాసాలను వేనోళ్ల కొనియాడుతోంది.

- వైభవంగా మృత్యుంజయేశ్వరుని ఆలయ జీర్ణోద్ధరణ మహోత్సవం
- శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు.. హోమం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం



కలశం తీసుకువస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లె : మండలకేంద్రంలోని అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న జీర్ణోద్ధరణ, విమాన గోపుర కలశ మహా సంప్రోక్షణ మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ ఎన్.రెడ్డెప్ప, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి హాజరైయ్యారు. వీరికి ప్రధాన అర్చకుడు రాజశేఖర దీక్షితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శాస్త్రోక్తంగా నిర్వహించిన హోమ పూజలో మంత్రి పెద్దిరెడ్డి పాల్గొన్నారు. విమాన గోపుర కలశాలకు జల సంప్రోక్షణ చేశారు.

రూ:2 కోట్లతో ఆధునికీకరణ

అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయాన్ని పుంగనూరు జమిందారు ఇమ్మడి చిక్కరాయులవారి పాలనలో నిర్మించారు. తదనంతరం శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని ఆధునికీకరించేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నడుంబిగించారు. రూ.2కోట్లతో విమాన గోపురాలు, నంది మండప గోపురం, అలంకార మండపం, ఆలయ పైభాగంలో సాలహారాలు, కింద గ్రానైట్, గోపుర శిల్పాలు, మహద్వారం ఏర్పాటు చేయించారు. పురాతన ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

శివపార్వతుల ప్రతిమ బహూకరణ

జీర్ణోద్ధరణ మహోత్సావానికి హాజరైన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేకంగా తయారు చేయించిన శివపార్వతుల ప్రతిమను బహూకరించారు. ఆలయాభివృద్ధికి చొరవ తీసుకున్న మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, మాజీ ఎంపీపీలు రెడ్డిప్రకాష్, అంజిబాబు, రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులుయాదవ్, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శంకర్ నారాయణ, రాధాకృష్ణ, నాయుని సుధాకర్‌మూర్తి, వరుణ్, కళ్యాణ్, నాగరాజా, చెన్నరాజశెట్టి, మహేష్‌బాబు, రాజన్న పాల్గొన్నారు.



పూర్ణాహుతి సమర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో ఎంపీ రెడ్డెప్ప, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్ తదితరులు

ఆపన్నులకు ఆర్థిక సాయం

చౌడేపల్లె మండలం పెద్దకొండామర్రిలో ఈనెల 19వ తేదీన సంపు శుభ్రం చేయడానికి వెళ్లి విషవాయువు కారణంగా బంగిరవి, తలారి వెంకటరమణ, గుర్రంకొండ మునిరాజా మృతి చెందిన విషయం విదితమే. సోమవారం వారి కుటుంబ సభ్యులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ ఎన్.రెడ్డెప్ప పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. వైఎస్సార్ బీమా కింద మరో రూ.5లక్షల వంతున అందించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. అలాగే ఇటీవల చౌడేపల్లె బస్టాండ్ వద్ద గుండెపోటుతో మృతి చెందిన రామచంద్ర నాయుడు స్వగ్రామం ఏ.కొత్తకోటకు మంత్రి పెద్దిరెడ్డి వెళ్లారు. మృతుని భార్య కె.ధనమ్మకు రూ.5లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, తహసీల్దార్ మాధవరాజు, ఎంపీడీఓ సుధాకర్, నేతలు నాగభూషణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, చిన్నా, మహమ్మద్ షఫీ పాల్గొన్నారు.



బాధితులకు చెక్‌లు అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మాయమాటలకు కేరాఫ్ చంద్రబాబు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : రాష్ట్రంలో మాయమాటలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి మండిపడ్డారు. సోమవారం మండలంలోని గాజులకండ్రిగలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచిన ఘనుడు నిజాయితీపరుడిని అని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. అప్పట్లో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఎత్తివేసిన ప్రజా కంటకుడు చంద్రబాబు అని విమర్శించారు. ప్రజలు ఎన్నుకున్న ఎన్టీఆర్‌ను పదవి నుంచి దించేసిన మోసకారి ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుంటే ఓర్వలేక పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లో మీడియా అండతో అమ్మఒడి, రైతు భరోసా, ఇంగ్లిష్ మీడియంలో చదువు, విద్యాదీవెన, నవరత్న పథకాలపై విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని చంద్రబాబుకు ప్రజలు ఓటేయాలని ప్రశ్నించారు. గతంలో కూడా ఎన్టీఆర్‌ను చూసి టీడీపీకి ఓటేశారే తప్ప చంద్రబాబును చూసి కాదని స్పష్టం చేశారు. అప్పట్లో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగిస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని, ఇప్పుడు జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కూడా కొనసాగిస్తామని తండ్రీకొడుకులు ప్రతి సమావేశంలో నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్‌లకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. 2014 ఎన్నికల్లో 600 హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోనే మాయం చేసి ప్రజలను వంచించారని తెలిపారు. వరుణుడికి చంద్రబాబు శత్రువని, ఆయన అధికారం చేపడితే రాష్ట్రంలో కరువు తాండవిస్తుందని, ఇందుకు గత అనుభవాలనే నిదర్శనమని వివరించారు. జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని స్పష్టం చేశారు.

పేదలంటే చంద్రబాబుకు చిన్నచూపు



నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ తదితరులు

- రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారు
- ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు : పేదలంటే చంద్రబాబుకు చిన్నచూపని, అభివృద్ధిని అడ్డుకోవడమే ఆయన నైజమని ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆరోపించారు. సోమవారం మండలంలోని కొలమాసనపలెలో వారు మాట్లాడుతూ. గత టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీకి ఒక ఇల్లు కూడా మంజూరు కాలేదన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల కోసం ఊళ్లే నిర్మిస్తున్నామని వెల్లడించారు. పేదలకు గూడు కల్పిస్తుంటే చంద్రబాబుకు కడుపు మంటని, అందుకే సమాధులతో పోలుస్తున్నారని మండిపడ్డారు. అనంతరం చంద్రబాబు వ్యాఖ్యలపై పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో కలిసి నిరసన తెలిపారు.

ఉన్నత విద్యావకాశాలకే 'ఓపెన్'



విజయకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న ఆనందరెడ్డి తదితరులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉన్నత విద్యావకాశాలను ఎక్కువమందికి కల్పించేందుకే అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటైనట్లు వర్సిటీ డైరెక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ వర్సిటీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ జారీ చేసే సర్టిఫికెట్లకు తక్కువ విలువ ఉంటుందని అనుకోకూడదన్నారు. దేశంలోనే తొలి ఓపెన్ యూనివర్సిటీ ఇదేనని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవలందిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ ఆనందరెడ్డి, కో–ఆర్డినేటర్ మీరాసాహెబ్ అభ్యర్థన మేరకు సైన్స్ ప్రాక్టికల్ జోనల్ కేంద్రానికి అనుమతి ఇస్తున్నట్లు వెల్లడించారు. కుప్పం, పలమనేరు, మదనపల్లె కేంద్రాల్లోని బీఎస్సీ విద్యార్థులు సైతం ఇకపై చిత్తూరులో తరగతులకు హాజరుకావచ్చని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిత్తూరు, తిరుపతి, పలమనేరు, కుప్పం, సత్యవేడు, శ్రీకాళహస్తిలో అంబేడ్కర్ వర్సిటీ కేంద్రాలున్నట్లు చెప్పారు. డిగ్రీతో పాటు పీజీ, వృత్తి విద్య, సాంప్రదాయ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఈ నెలాఖరులోపు అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు. ఆయనను అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

పోలీస్ పరీక్షలకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ పరీక్షలకు హాజరయ్యే 150 మంది అభ్యర్థులకు ఎస్పీ రిశాంత్‌రెడ్డి సోమవారం చిత్తూరులో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోస్టుల భర్తీలో దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. దాతల సాయంతో ప్రిలిమ్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేశామన్నారు. త్వరలోనే స్టడీ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఏకాగ్రతతో మెయిన్ పరీక్షకు సన్నద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తం.. ఇంద్రవరదుని ధ్వజారోహణం

- చంద్రప్రభ వాహనంపై దేవదేవేరుల విహారం

యాదమరి: మండలకేంద్రంలోని త్రివేణి సంగమంలో వెలసిన ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. వేదపండితులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక అభిషేకం చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం దేవదేవేరుల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది మంగళవాయిద్యాల నడుమ ధ్వజస్తంభం వద్ద కొలువుదీర్చారు. భట్టాచార్యులు పవనకుమార్ స్వామి, వరదరాజాచార్యులు, శ్యామసుందరాచార్యులు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి 12 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఆగమశాస్త్ర ప్రకారం ధ్వజారోహణ నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై కర్పూర నీరాజనాలు సమర్పించుకున్నారు. అనంతరం బలిపీఠం, ఉత్సవ మూర్తులను వైభవంగా పుర వీధుల్లో ఊరేగించారు.

చంద్రప్రభ వాహనంపై విహారం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవదేవరులు సోమవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరించారు. విశేషం సంఖ్యలో భక్తులు తరలివచ్చి వైకుంఠనాథుని వైభవాన్ని వీక్షించారు. కార్యక్రమంలో బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు, వేద పండితులు మురళీ, హేమంత్ ఆచార్యులు, కృష్ణాచార్యులు పాల్గొన్నారు.

నేడు హంసవాహన సేవ

స్వామివారు మంగళవారం ఉదయం ఉభయదేవేరీ సమేతంగా చప్పరంలో కొలువుదీరి విహరించనున్నారు. రాత్రి హంసవాహనాన్ని అధిరోహించి ఊరేగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



చంద్రప్రభ వాహనంపై దేవదేవేరులు



ఆలయం వద్ద ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేద పండితులు



ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,350
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,665
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.77

పిడుగు పడి రెండు ఆవుల మృతి



ఆవుల కళేబరాల వద్ద భూషణమ్మ

నగరి : మండలంలో సోమవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో మండలంలోని ఎం.కొత్తూరు గ్రామంలో భూషణమ్మ అనే రైతుకు చెందిన రెండు ఆవులు పిడుగుపాటుకు మృతి చెందాయి. ఒక్కో ఆవు సుమారు రూ.70 వేలు విలువ చేస్తుందని బాధితురాలు తెలిపింది. వీఆర్ఓ ఘటనాస్థలానికి చేరుకుని ఆవుల కళేబరాలను పరిశీలించారు. వివరాలను నమోదు చేసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు.

గృహ నిర్మాణం చేపట్టకుంటే చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించకపోతే రద్దు చేసి, అర్హులైన మరొకరికి మంజూరు చేస్తామని కలెక్టర్ షణ్మోహన్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంజూరైన గృహ నిర్మాణాలను ఈ నెల 31 లోపు మొదలు పెట్టాలన్నారు. గత వారం నిర్దేశించిన లక్ష్యం మేరకు 3,206 గృహాలకు గాను 2,502 పూర్తి చేసినట్లు చెప్పారు.

'జగనన్నకు చెబుదాం'పై ప్రత్యేక దృష్టి

జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన వాటిని 48 గంటల్లో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. శ్మశానవాటికలకు గుర్తించిన స్థలాకు సంబంధించి ఈ నెల 31వ తేదీ లోపు హద్దులు గుర్తించాలని చెప్పారు. రామకుప్పం, శాంతిపురం, కుప్పం మండలాల్లో బీఎస్ఎన్ఎల్ 4జీ సెల్ టవర్స్ నిర్మాణాలకు అవసరమైన ప్రభుత్వ భూములను అప్పగించాలని కోరారు. ఇంటి మంజూరు వచ్చిన దరఖాస్తులను 90 రోజుల్లో పరిష్కరించాలని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్, పక్కన జేసీ శ్రీనివాసులు

పకడ్బందీగా వసతిగృహాలు

జిల్లా వ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాలను సమస్యల రహితంగా పకడ్బందీగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయా హాస్టళ్లను వారంలోపు పరిశీలించి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు నివేదికలు పంపాలన్నారు. జూన్ 12వ తేదీన పాఠశాలలు ప్రారంభించే సమయానికి అన్ని వసతి గృహాల్లో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఉపాధి హామీ కింద కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించాలని సూచించారు. నాడు–నేడు పనుల పురోగతికి సంబంధించిన ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పది, ఇంటర్‌లో ప్రతిభ కనబరచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకోసం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, ఈ నెల 25వ తేదీన ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. సమీక్షలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఈఓ విజయేంద్రరావు, ఏపీసీ వెంకటరమణారెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, మైనారిటీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి



కుప్పంరూరల్: మండలంలోని గుడ్లనాయనపల్లె– ఓఎన్ కొత్తూరు రహదారిపై కల్వర్టు వద్ద అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న గుడుపల్లె పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎక్కడో కొట్టి చంపి, ఇక్కడ తీసుకువచ్చి పడేసినట్లుగా అనుమానిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అగ్ని గుండంలో ప్రవేశిస్తున్న పచ్చ గెరిగ



అగ్నిగుండ ప్రవేశానికి విచ్చేసిన అమ్మవారు

పునీతం.. అగ్నిప్రవేశం

కుప్పం : పట్టణంలోని ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ముత్తుమారెమ్మ అగ్నిప్రవేశాన్ని ఘనంగా చేపట్టారు. అమ్మవారి శిరస్సుకు తెర తొలగించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ మారెమ్మను అగ్నిగుండం వద్దకు వేంచేపు చేశారు. సోముశాస్త్రి ఆధ్వర్యంలో అర్చకులు గుండానికి పూజలు నిర్వహించారు. గోవింద నామ స్మరణల మధ్య అమ్మవారి ఉత్సవ మూర్తిని అగ్ని ప్రవేశం చేయించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

54 పుష్పపల్లకీలతో గ్రామోత్సవం

ముత్తుమారెమ్మ అగ్నిగుండ ప్రవేశం సందర్భంగా 54 ట్రాక్టర్లతో పుష్పపల్లకీలను ఊరేగించారు. ప్రతి ట్రాక్టరును పువ్వులతో అలంకరించి అందులో అమ్మవారి ప్రతిమలను కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపించారు.

నేడు శిరస్సు ఊరేగింపు

గంగమ్మ జాతరను పురస్కరించుకుని ప్రసన్న తిరుపతి గంగమ్మ శిరస్సుకు తెర తొలగించి మంగళవారం పట్టణంలో ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వసతులు కల్పించారు.

జీవవైవిధ్యాన్ని పరిరక్షిద్దాం

- రాష్ట్రంలో ఇంటింటికీ ఔషధ మొక్కలు
- అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి

సాక్షి, తిరుపతి: జీవవైవిధ్యాన్ని తిరిగి నిర్మిద్దామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి ఎస్వీ వెటర్నరీ ఆడిటోరియంలో సోమవారం అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం– 2023 ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పెద్దిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. మానవాళి మనుగడకు జీవవైవిధ్య పరిరక్షణ అవసరమన్నారు. జీవవైవిధ్య చట్టం– 2002, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం 2006లో జీవవైవిధ్య మండలి ఏర్పాటుచేసి రాష్ట్ర, జిల్లా, మండల, పంచాయతీ స్థాయిల్లో ప్రజా జీవవైవిధ్య రిజిస్టర్ (ఈ–పీబీఆర్)ను సిద్ధం చేసిందన్నారు.

ఇంటింటికి ఔషధ మొక్కలు

రాష్ట్రంలో ఇంటింటికీ ఔషధ మొక్కల పంపిణీలో భాగంగా 13 వేల స్వయం సహాయక సంఘాల ద్వారా 5.82 లక్షలు మొక్కలు, 11 నర్సరీల ద్వారా 6.6 లక్షల ఔషధ మొక్కలు పంపిణీ చేసినట్టు తెలిపారు. జీవవైవిధ్య పార్కులు, జీవవైవిధ్య మ్యూజియంలు, జీవ వైవిధ్య వారసత్వ ప్రదేశాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు పోతున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్న జీవవైవిధ్యాన్ని సంరక్షించడం, జీవవైవిధ్యాన్ని సుస్థిరమైన విధానాల్లో వినియోగించడం, జీవ వనరులు వాణిజ్యపరంగా వినియోగం ద్వారా వచ్చిన ప్రయోజనాలను హక్కుదారులకు సమానంగా పంపిణీ చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యాచరణ ప్రణాళిక మేరకు 2030 ఒప్పందంలో ఉన్న అన్నింటినీ అమలు చేయనున్నట్టు తెలిపారు. 2050 నాటికి సురక్షితమైన, సుస్థిరమైన జీవవైవిధ్యాన్ని సాధించేందుకు సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బయోడైవర్సిటీ బోర్డ్, యోగి వేమన విశ్వవిద్యాలయం, మత్స్యశాఖ, నేషనల్ గ్రీన్ కార్పొరేషన్‌తో పాటు.. ఫారెస్ట్ జువాలాజికల్‌పార్క్ సంయుక్తంగా జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా, వ్యవసాయశాఖ, పరంపర వైద్య మహాసంఘం పుత్తూరు ఆయుర్వేద నిలయం, డీఆర్డీఏ వారు చిరుధాన్యాల ప్రాధాన్యత, విద్యవిద్వాన్ బద్వేల్ ఆయుర్వేదం, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఫారెస్ట్‌శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన జీవవైవిధ్యాన్ని తిరిగి నిర్మిద్దాం అని మిషన్ లైఫ్ సెల్ఫీ తీసుకున్నారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జీవవైవిధ్య మండలి చైర్మన్ బీఎంకే.రెడ్డి, అడిషనల్ పీసీసీఎఫ్‌కే.గోపీనాథ, టీటీడీ బోర్డ్ మెంబర్ పోకల అశోక్‌కుమార్, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల జీవవైవిధ్య మండలి సభ్యులు పాల్గొన్నారు.



నివేదికను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప తదితరులు

జిల్లా అభివృద్ధికి చంద్రబాబు అడ్డుకట్ట

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర విషయం అటుంచితే సొంత జిల్లా అభివృద్ధికి చంద్రబాబు అడ్డుకట్ట వేస్తుండడం చిత్తూరు జిల్లా వాసుల దౌర్భాగ్యమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. చిత్తూరు జిల్లాలోని మిట్ట ప్రాంతాలు కరువుతో అల్లాడుతున్నాయని, ఇక్కడి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు మూడు రిజర్వాయర్ల ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తుంటే, దీనిని అడ్డుకోవడానికి కుట్రపూరితంగా సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చిన ఘనుడు చంద్రబాబని ధ్వజమెత్తారు. మన రాష్ట్రానికి విస్తారమైన తీర ప్రాంతం ఉందని, ఇలాంటి వనరుని ఉపయోగించుకుని పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల ద్వారా గణనీయమైన అభివృద్ధి సాధించాలన్నదే ముఖ్యమంత్రి తాపత్రయమన్నారు. అన్ని అనుమతులు వచ్చాకనే మచిలీపట్నం పోర్టుకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండానే గతంలో చంద్రబాబు మచిలీపట్నం పోర్టుకు శంకుస్థాపన చేయడం కేవలం ఎన్నికల లబ్ధి కోసమేనని తూర్పారబట్టారు. మందకృష్ణ మాదిగ పేమెంట్ ఆర్టిస్ట్ అని, వాస్తవాలతో పనిలేకుండా చంద్రబాబు స్క్రిప్టును వల్లించడమే అతని పని అని ఎద్దేవా చేశారు.